వనమహోత్సవానికి అంతా సిద్ధం

- అందుబాటులో మొక్కలు
- గ్రామానికో ఐదువేల మొక్కలు నాటాలని లక్ష్యం
- అనుమతి రాగానే పనులు ప్రారంభం


మానకొండూర్‌లోని నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

మానకొండూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవానికి అంతా సిద్ధం చేశారు. జూన్‌లో కార్యక్రమం మొదలుకానుంది. మొక్కల నాటేందుకు ఖాళీ స్థలాల గుర్తింపు, గుంతల తవ్వకం వంటి పనులు చేపట్టేందుకు అధికారులు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగుతున్నారు. నర్సరీల్లో అందుబాటులో ఏపుగా పెరిగిన వివిధ రకాల మొక్కలు ఉన్నాయి. గుంతలు తవ్వడానికి వరుణదేవుడు కరుణించడంతో పనులకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

గ్రామానికి ఐదువేలు లక్ష్యం

వనమహోత్సవంలో భాగంగా మండలానికి లక్షా అరవై వేల వరకు, గ్రామానికి ఐదువేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రతి గ్రామంలోని నర్సరీలో 8 వేల నుంచి 10 వేల వరకూ వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఏపుగా పెరిగిన మొక్కలను నాటేందుకు వర్షాలు కూడా పడుతున్నాయి. దీంతో ఈసారి త్వరగా గుంతలు తీయించి మొక్కలు నాటించాలని అధికారులు భావిస్తున్నారు. జూన్ రాకముందే వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఉపాధిహామీ కూలీలతో గుంతలు తీయించి మొక్కలు నాటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కమ్యూనిటీ స్థలాలు, రహదారుల (అవెన్యూ) ఇరువైపుల, ఇతర ప్రదేశాల్లో మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించారు.

అక్కడక్కడ స్థలాల కొరత

గ్రామానికి పదివేల మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నా మొక్కలు నాటేందుకు సరైన స్థలాలు దొరకడం లేదు. హరితహారం, వనమహోత్సవం పేరిట మొక్కలు నాటిస్తుండటంతో మొక్కలు నాటేందుకు స్థలాల కొరత ఎదురవుతోందని అధికారులు చెబుతున్నారు. గ్రామానికి నాలుగు లేదా ఐదువేల మొక్కలు నాటాలని భావిస్తున్నా వెయ్యి నుంచి రెండు వేల మొక్కలు నాటేందుకు మాత్రమే స్థలాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

ఎఫ్‌పీవో సేవలు వినియోగించుకోవాలి


శాఖను ప్రారంభిస్తున్న ఏవో త్రివేదిక

రామడుగు: మండలంలోని షానగర్ గ్రామ చౌరస్తా వద్ద సోమవారం ఎఫ్‌పీవో బ్రాంచ్‌ను మండల వ్యవసాయాధికారి త్రివేదిక ప్రారంభించారు. తిర్మలాపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కేంద్రం ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో చైర్మన్ గంట్ల రవీందర్‌రెడ్డి, సీఈవో రాజు, సీఎస్ఏ ప్రతినిధులు సత్యపాల్, రమేశ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపు అసత్యం


మాట్లాడుతున్న లక్ష్మీరాజం, తదితరులు

గంగాధర: మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించామని ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం విమర్శించారు. గంగాధరలో సోమవారం మాట్లాడారు. ప్రభుత్వం మాజీ సర్పంచులను మనోవేదనకు గురిచేస్తూ ఆత్మహత్యలకు ప్రేరేపిస్తోందన్నారు. ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ ద్వారా పెండింగ్ బిల్లులు చెల్లించామని చెబుతుందని, ఈ ఫండ్ ద్వారా అగ్రిమెంటు చేసుకున్న కాంట్రాక్టర్లు మాత్రమే బిల్లులు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఎస్డీఎఫ్ చెక్కులు రెండు వేలు పెండింగ్‌లో ఉంటే తొమ్మిది చెక్కులకు మాత్రమే నిధులు విడుదల చేశారని అవికూడా లక్ష రూపాయల లోపువే అని, అప్పు చేసి అభివృద్ధి పనులు చేశాం బిల్లులు అన్ని చెల్లించాలని మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు మేచినేని నవీన్‌రావు, వేముల దామోదర్, నజీర్‌హుస్సేన్, మేఘరాజు, మడ్లపల్లి గంగాధర్, రామిడి సురేందర్, ముక్కెర మల్లేశం, ఆదిమల్లు, అంజన్న, కనకయ్య తదితరులున్నారు.

‘ప్రజాపాలన పేరుతో రౌడీయిజం’

గంగాధర: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో రౌడీయిజం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధరలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పోలీసులు బీఆర్ఎస్ నాయకులపై ఒక రకంగా, కాంగ్రెస్ నాయకులపై మరో రకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాలన చేతగాక సిరిసిల్లలో కేటీఆర్ ఆఫీస్‌పై కాంగ్రెస్ నాయకులు దాడి చేస్తున్నారని, ముఖ్యమంత్రి ఫొటో పెట్టాలని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ ఫొటో ఉందో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా దాడులకు పాల్పడుతూ ప్రజాస్వామ్య విలువలను పాతరేస్తున్నారని విమర్శించారు.

సీపీఐ ఇల్లందకుంట కార్యదర్శిగా మాదారపు రత్నాకర్‌గౌడ్



ఇల్లందకుంట: సీపీఐ ఇల్లందకుంట మండల కార్యదర్శిగా మల్యాల గ్రామానికి చెందిన మాదారపు రత్నాకర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మల్యాలలో నిర్వహించిన సీపీఐ మండల సభలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మర్రి వెంకటస్వామి నియామకపత్రాలు అందజేశారు. అనంతరం రత్నాకర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఇది సరైందికాదన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. రత్నాకర్ నియామకం పట్ల పార్టీ నాయకులు, పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు తొలగింపు



రామడుగు: దాదాపు ముప్పై ఏళ్లుగా వినియోగంలో ఉన్న రోడ్డును, మట్టిని రంగసాయిపల్లి గ్రామానికి చెందిన రైతు కడారి తిరుపతి జేసీబీతో తొలగించి పక్క రైతు పొలంలో పోసి రోడ్డు ధ్వంసం చేశాడని కోరటపల్లి గ్రామ రైతులు తెలిపారు. కోరటపల్లి నుంచి రుద్రారం, రంగసాయిపల్లికి రైతులు, పలు గ్రామాల ప్రజలు వెళ్లేందుకు వీలుగా ప్రభుత్వం రోడ్డు నిర్మించిందన్నారు. తనకు భూమి వస్తదని రోడ్డును పూర్తిగా తొలగించాడని, అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి యథావిధిగా రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు.

సొంతింటి కల నెరవేరుస్తున్నాం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


రైతుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేరుస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ , కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. చొప్పదండిలోని దుర్గామాత ఆలయం ఎదట, కొలిమికుంటలో బోర్‌వెల్ ప్రారంభించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎం శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి తిరుపతిరావు, హౌజింగ్ పీడీ గంగాధర్, తహసీల్దార్ నవీన్ కుమార్, ఎంపీడీవో వేణుగోపాల్ రావు, ఎంపీవో రాజగోపాల్, ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, వైస్ చైర్మన్ రాజేందర్, కొండగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గుర్రం నీరజ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు చేయాలని వినతి

రామడుగు: వెదిరలో శ్రీవినాయకరెడ్డి సంక్షేమ సంఘం భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని సంఘం ప్రతినిధులు కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

బాధిత రైతుకు పరిహారం

గంగాధర: ఇటీవల పిడుగుపాటుతో మండలంలోని కాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దేశెట్టి వీరమల్లయ్యకు చెందిన రెండు ఎద్దులు మృతిచెందాయి. బాధిత రైతు ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే రూ.64 వేల చెక్కు అందజేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని..

గంగాధర: బెస్ట్ అవలెబుల్ స్కూళ్లకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేను కోరారు. మధురానగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు.

పోలీస్ స్టేషన్లు తనిఖీచేసిన సీపీ గౌస్ ఆలం


జమ్మికుంట టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీపీ గౌస్ ఆలం

జమ్మికుంట: పట్టణ పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ కమిషనర్ గౌస్ ఆలం సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్, గాంధీ చౌక్ వంటి ముఖ్యమైన రద్దీ ప్రాంతాలను సందర్శించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, రద్దీ ప్రాంతాల్లో నిఘా, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ ఎస్ రామకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు. జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించారు. శాంతిభద్రతలు, పోలీస్ స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసుల పరిష్కారం, ఎస్ఐల పనితీరు, అక్రమ కార్యకలాపాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు వంటి సమస్యలపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, వీణవంక ఎస్సై తోట తిరుపతి, ట్రైనీ ఎస్ఐలు సాయికృష్ణ, దీపక్ పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ


విత్తనాలందిస్తున్న స్వప్న, ఏవో ఖాదర్‌హుస్సేన్

జమ్మికుంట: జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ చైర్ పర్సన్ స్వప్న, ఏవో ఖాదర్ హుస్సేన్ అన్నారు. సోమవారం పట్టణంలోని అబాది జమ్మికుంట రైతు వేదిక వద్ద సబ్సిడీపై జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధి డీసీఎంఎస్ అబాది జమ్మికుంట, మున్సిపల్ పరిధి కొత్తపల్లి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, మండల పరిధిలోని పీఏసీఎస్ తనుగులలో 95 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు పట్టపాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో సంబంధిత ఏఈవోను సంప్రదించి అనుమతి పత్రంతో విత్తనాలు పొందవచ్చొన్నారు. 30 కిలో బస్తా 50 శాతం రాయితీపై రూ.2138 లభిస్తుందని, మరో మూడు రోజుల్లో వంద క్వింటాళ్లు అందుబాటులోకి వస్తాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలోమార్కెట్ గ్రేడ్–2కార్యదర్శి రాజాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం, హన్మాజిపల్లె, సాంబయ్యపల్లె, గుండ్లపల్లి గ్రామాల్లోని డీసీఎంఎస్ కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి సోమవారం ప్రకటనలో తెలిపారు. 30 కిలోల జీలుగ బస్తా రెండున్నర ఎకరాలకు చల్లుకోవచ్చని, అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుల జిరాక్స్‌తో సంప్రదించాలని కోరారు.

శంకరపట్నం: సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందిస్తున్నట్లు ఏవో వెంకటేశ్ తెలిపారు. మెట్‌పల్లి సహకార సంఘం పరిధికొత్తగట్టు, మెట్‌పల్లి, మొలంగూర్, కన్నాపూర్ గోదాముల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

విద్యకు దూరం చేయొద్దు

జమ్మికుంట: గురుకులాల్లో ఇంటర్ కోర్సు రద్దు చేస్తూ రాష్ట్ర గురుకుల సెక్రెటరీ తీసుకున్న నిర్ణయం దళిత, పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే ఉద్దేశమేనని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో మాట్లాడారు. గురుకులాల్లో ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, 12 ఎస్సీ గురుకులాల్లో 8 బాలికలవేనని, బాలికలను విద్యకు దూరం చేసే దుశ్చర్యకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆరోపించారు. గురుకులాల్లో ఇంటర్ విద్యను యథావిధిగా కొనసాగించకపోతే విద్యార్థి, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమిస్తామన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పొడిగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఎంపీ చిత్రపటానికి వినతి

జమ్మికుంట: పట్టణంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చిత్రపటానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సజ్జు, మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్‌లు మాట్లాడారు. జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో ఫుట్ వోవర్ బ్రిడ్జి, కరీంనగర్ – తిరుపతికి వారంలో రెండు రోజులు ట్రైన్ నడిపించాలని, హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడాలన్నారు. అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి ఒక్క రూపాయి కేటాయించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సంధ్య నవీణ , నియోజవర్గ ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్, రమేష్, మండల ఉపాధ్యక్షుడు సాగర్, వినయ్, శ్రీకాంత్, ప్రవీణ్, బాను, సతీష్, శివ, పవన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

తిమ్మాపూర్: యువత స్మార్ట్‌ఫోన్లు, బెట్టింగ్, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని శాతవాహన అర్బన్ అభివృద్ధి సంస్థ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సూచించారు. ఎల్ఎండీ కాలనీలోని క్రీడా మైదానంలో సోమవారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను వి.నరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ యువత భవిష్యత్ ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడలు మానసిక ఉల్లాసం, ఆరోగ్యాన్ని అందిస్తాయని అందుకే యువజన కాంగ్రెస్ క్రీడలను ప్రోత్సహిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. యువతలో మార్పు తీసుకొచ్చేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. ఐపీఎల్ ద్వారా వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ వంటి వారు ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు వాసు, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, అనిల్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 32 జట్లు పాల్గొనే టోర్నమెంట్‌లో మొదటి మ్యాచ్ తిమ్మాపూర్ మండలం గొల్లపల్లి, మానకొండూర్ మండలం వన్నారం జట్ల మధ్య జరిగింది.

క్రైం వార్తలు

- **ప్యాసింజర్ ఆటోలో మంటలు**

హుజూరాబాద్: ప్యాసింజర్ ఆటోలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో ప్రయాణికులకు తృటిలో పెను ప్రమాదం తప్పిన ఘటన సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. జమ్మికుంట నుంచి హుజూరాబాద్‌కు వస్తు న్న ఆటో అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రయాణికులను దింపే క్రమంలో మంటలు రావడంతో అప్రమత్తమైన ఆటో డ్రైవర్ నీళ్లు చల్లి మంటలను ఆర్పేశాడు.

- **పారిశుద్ధ్య కార్మికుడి మృతి**

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ పారిశుద్ధ్య కార్మికుడు కొంకటి రాజయ్య (61) సోమవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. జీపీకి ఎన్నో ఏళ్లుగా సేవలందించాడని, కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ సొల్లు అజయ్‌వర్మ, గ్రామస్తులు కోరారు.

- **చికిత్స పొందుతూ ఒకరు...**

గన్నేరువరం: గన్నేరువరానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవీందర్ చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల సిరిసిల్లా జిల్లా కొదురుపాక–నాంపెల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య రాధ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు.

- **విద్యుత్ షాక్‌తో గేదె..**

హుజూరాబాద్: పట్టణ శివారులోని గుండ్ల చెరువు పోచమ్మ ఆలయ సమీపంలో గొల్లవాడకు చెందిన సింగరవేణి శ్రీనివాస్ పాడిగేదె విద్యుత్ షాక్‌తో సోమవారం మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తుండగా షాక్ తగిలి మృతి చెందిందని, లక్ష వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు.


- **అదృశ్యం కేసు**

జమ్మికుంట: పట్టణంలోని ఓ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న యువతి అదృశ్యం కాగా సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ ఎస్ రామకృష్ణ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామానికి చెందిన యువతి ఆదివారం ఆసుపత్రికి వచ్చి ఇంటికి రాలేదు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

- **ఓగులాపూర్‌కు చేరిన చందు మృతదేహం**

చిగురుమామిడి: మండలంలోని ఓగులాపూర్ గ్రామానికి చెందిన బూడిద చందు వారం రోజుల క్రితం దుబాయిలో గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరగా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. జీవనోపాధికి దుబాయి వెళ్లిన కొడుకు శవమై రావడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రామకృష్ణకాలనీలో కంటి వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిమ్మాపూర్: రామకృష్ణ కాలనీ గ్రామ పంచాయతీ ఆవరణలో మాజీ వార్డు సభ్యుడు దావు సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ ఆసుపత్రి సిబ్బంది ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. దావు సంపత్ రెడ్డి, మాచర్ల అంజయ్య మాట్లాడుతూ 200 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారిని ఆసుపత్రికి రెఫర్ చేశారని, కంటి పరీక్షలు అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు సంగుపట్ల మల్లేశం, మాచర్ల అనిల్, మాచర్ల శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది అజయ్, ప్రశాంత్, అన్వేష్, ప్రేమ్ కుమార్, రూతా, తిరుపతి, రామారావు తదితరులున్నారు.


చొప్పదండి : వెదురుగట్టులో లగ్గం బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వైభవంగా బీరప్ప ఉత్సవాలు

చొప్పదండి: మండలంలోని వెదురుగట్టులో బీరప్ప మహంకాళి ఉత్సవాలు యాదవ కుర్మ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. పోచమ్మ బోనాలతో ప్రారంభమై గంగబోనం, లగ్గం బోనాలతో మహిళలు గ్రామ శివారులోని గుడికి తరలివెళ్లి మొక్కులు సమర్పించారు. సోమవారం లగ్గం పట్నంతో ఒగ్గ పూజారులు పూజలు చేశారు. ఈ నెల 30 వరకు ఉత్సవాలు జరుగుతాయని యాదవ కుర్మ సంఘం నాయకులు తెలిపారు.

వెండి కిరీటాల బహూకరణ

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ఉత్సవ విగ్రహాలకు రూ.1.70 లక్షలతో గ్రామానికి చెందిన రూపురెడ్డి శేషు, సుస్మిత దంపతులు రత్నాలతో కూడిన వెండి కిరీటాలు చేయించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు బహూకరించారు. మరో దాత అప్పిడి రేఖ, రాజిరెడ్డి దంపతులు రూ.40 వేలతో మకరతోరణం బహూకరించారు. దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ ముష్కె వెంకట్ రెడ్డి, పూజారి కుర్మాచలం రత్నాకర్ కృతజ్ఞతలు తెలిపారు.


చిగురుమామిడి: బొమ్మనపల్లిలో నిర్వహించిన బడిబాటలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి


మానకొండూర్: అధికారులు, టీచర్ల సమావేశం

మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు అన్నారు. మండలంలోని అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అధికారులు, ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. అలాగే లలితాపూర్ గ్రామాన్ని సందర్శించి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, విద్య అందిస్తున్నామని పాఠశాలకు రావడానికి ఆటో సౌకర్యం కల్పిస్తామని, పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిషన్, పంచాయతీ ప్రత్యేకాధికారి కిరణ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు కవిత, గ్రామ కార్యదర్శి అశ్విని, ప్రధానోపాధ్యాయులు సుదర్శనం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని హెచ్ఎం లక్ష్మణ్‌రావు కోరారు. సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత విద్య, నాణ్యమైన భోజనం, యూనిఫాం, షూ, టెక్స్ట్, నోట్ బుక్స్ అందిస్తోందని ఇంటింటా తిరుగుతూ విద్యార్థులను నమోదు చేసుకోవాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం విక్రమ్‌కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిబాట సన్నాహక సమావేశం

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బడిబాట సన్నాహక సమావేశం నిర్వహించినట్లు ఇన్‌చార్జి హెచ్ఎం రాజు తెలిపారు. ఇంటింటి సర్వే నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘం ప్రతినిధులు, టీచర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **గ్రేట్ పీపుల్ మేనేజర్ అవార్డు**

హుజూరాబాద్: పట్టణానికి చెందిన ఆడెపు ధీరజ్‌కు జాతీయస్థాయి గ్రేట్ పీపుల్ మేనేజర్స్ అవార్డు లభించింది. ధీరజ్ బిర్లా ఓరియంట్‌లో హెడ్‌గా పని చేస్తున్నాడు. దేశ వ్యాప్తంగా సెలెక్ట్ అయిన వంద మందికి ముంబైలో అవార్డులు ప్రదానం చేశారు.

- **నేడు రాజీవ్ యువ వికాసం సమావేశం**

శంకరపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం రాజీవ్ యువవికాసం పథకం సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు.

- **కరీంపేటలో ఎంపీ నిధులతో బోర్‌వెల్**

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామంలో కరీంనగర్ ఎంపీ నిధులతో బోరుబావి వేశామని బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్ తెలిపారు. కేంద్ర హోం శాఖసహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఇటీవల గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు కలిసి బోర్ వేయించాలని విన్నవించాగా సోమవారం బోర్ వేశామన్నారు.

- **కమీషన్లపై బహిరంగ చర్చకు సిద్ధమా**

శంకరపట్నం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, రేషన్‌కార్డులు ఇప్పిస్తామని బీఆర్ఎస్ నాయకులు కమీషన్లు తీసుకున్నారని, బహిరంగ చర్చకు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సిద్ధమా అని మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ సవాల్ విసిరారు. కేశవపట్నంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు.

- **ఏవోకు వినతి**

హుజూరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరుతూ సోమవారం ఆర్డీవో కార్యాలయంలోని ఏవోకు బీసీ ఆజాదీ ఫెడరేషన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. జిల్లా కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

- **ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీ**

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో ఓ స్వీట్ షాపును జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అంకిత్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశా. స్వీట్ షాపుపై ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేశామన్నారు. ఫుడ్ తయారీలో కలర్స్, నూనె నాణ్యమైనవి వాడడం లేదని, వర్కర్స్ శుభ్రత, జాగ్రత్తలు పాటించడంలేదని, ఆహార పదార్థల శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామని రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

బీఆర్ఎస్ నుంచి కవితను పంపేందుకు కుట్ర


మాట్లాడుతున్న ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ కాంతం

కరీంనగర్ కార్పొరేషన్: ఆస్తిలో వాటా అడిగినందుకు, బీసీలు, ఎస్సీల గురించి మాట్లాడుతున్నందుకు కవితను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించేందుకు కుట్ర జరుగుతుందని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గజ్జెల కాంతం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులో రూ.3 లక్షల కోట్లు కేసీఆర్ కుటుంబమే దోచుకుందని అన్నారు. సోమవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ మతి తప్పి సీఎం రేవంత్‌పై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముందు తన ఇంటిని చక్కదిద్దుకొని కాంగ్రెస్ గురించి మాట్లాడాలని సూచించారు. కేసీఆర్ ఆస్తిలో సమాన పంపకాలు అడిగినందుకు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణపై మాట్లాడినందుకే కవితను కేసీఆర్, కేటీఆర్ కలిసి పార్టీ నుంచి బయటకు పంపుతున్నారని విమర్శించారు. తెలంగాణలో దోచుకొన్న వేల కోట్ల రూపాయలతో అమెరికా, సింగపూర్, దుబాయి, లండన్‌లలో వ్యాపారాలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ బాగుంటే అందులోనే ఉండడం, లేదంటే బీజేపీలోకి వెళ్లేందుకు హరీశ్‌రావు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని తెలిపారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కరీంనగర్ : శ్రవణ్, ACO - 9948820305
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : రాములు - 9160083195
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602934, 9951602933, 9951602824
Office mail : knrjagati@gmail.com